క్లుప్తంగా

రాట్నాలమ్మకు సారె సమర్పణ



అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

పెదవేగి: మండలంలోని రాట్నాలకుంట రాటాన్లమ్మవారికి శుక్రవారం ఆలయ అర్చకులు పుష్పాలు, అరటిపండ్లు, నిమ్మకాయలతో అలంకరించారు. అమ్మవారి ఆలయం చుట్టూ ఉన్న భక్తులు, గ్రామంలోని భక్తులు ఆషాఢ మాసం సందర్భంగా సారె సమర్పించారు. అమ్మవారికి పూజలు చేశారు.

శాకంబరిగా అమ్మవారి దర్శనం

భీమడోలు : గుండుగొలనులో అతిపురాతన శ్రీభ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం అమ్మవారు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో ఆషాఢమాసం పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు.

'మిషన్ శక్తి'పై అవగాహన



మిషన్‌శక్తి గురించి వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి

ఉంగుటూరు: మహిళలు, బాలికలకు అండగా మిషన్‌శక్తి కార్యక్రమాలు దోహదపడతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డీవీ శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం ఉంగుటూరు 185 అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు, బాలికలకు మిషన్‌శక్తి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. శ్రీలక్ష్మి మాట్లాడుతూ 100 రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాలతో మహిళలు శక్తి వంతులుగా మారతారని, సమస్యలను పరిష్కరించుకునే శక్తి వారిక వస్తుందని వివరించారు. జూన్ 21 నుంచి అక్టోబరు 4 వరకు మిషన్ శక్తి కార్యక్రమాలు సీడీపీఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బాల్య వివాహాలు, బాలికలపై హత్యాచారాలను అరికట్టేందుకు తల్లులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మహిళల సంరక్షణకు ఒన్‌స్టాప్ సెంటర్‌ను వినియోగించుకోవాలని సూచించారు.

ఎంఆర్‌పీఎస్ సమావేశాలు నిర్వహించాలి

దెందులూరు : ఎంఆర్‌పీఎస్ జిల్లా విస్తృత స్థాయి సమావేశాలు ఈ నెల 24లోపు అన్ని జిల్లా, మండల, గ్రామాల్లో విధిగా నిర్వహించాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్ కోరారు. శుక్రవారం కొత్తపల్లిలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు కోసం జాతీయ యావత్తు ఎదురుచూస్తున్న విషయం అందరికి తెలిసిందేనన్నారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ స్ఫూర్తితో దశాబ్దాలుగా జరిగిన ఉద్యమంలో వందలాది మంది ప్రాణాలు అర్పించారన్నారు. ప్రతి గ్రామంలోనూ ఎంఆర్‌పీఎస్ జెండా ఎగురవేయాలని సూచించారు.

ఏలూరు రైల్వే ఎస్సైగా సైమన్

ఏలూరు టౌన్: మంగళగిరి రైల్వేశాఖ ఐజీ ఉత్తర్వుల మేరకు పీతల సైమన్ ఏలూరు రైల్వే ఎస్సైగా నియమితులయ్యారు. ఆయన శుక్రవారం ఏలూరులో బాధ్యతలు చేపట్టారు. ఏలూరు జీఆర్‌పీ, రాజమండ్రి జీఆర్‌పీలో ఏఎస్‌ఐగా పనిచేస్తూ ఇటీవల ఆయన ఎస్సైగా పదోన్నతి పొందారు. ఆయనకు ఏలూరు రైల్వే నూతన ఎస్సైగా పదోన్నతి లభించింది.

ఉపాధి హామీ గ్రామ సభలు

పెదపాడు : మండలంలోని నాయుడుగూడెం, తోటగూడెం, తాళ్లగూడెం గ్రామాల్లో శుక్రవారం ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహించారు. వివిధ గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీల్లో వ్యక్తమైన అభ్యంతరాలను గ్రామసభలో చదివి వినిపించారు. ఆయా గ్రామాల కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

గొడుగుల పంపిణీ

ఏలూరు టౌన్ : ఏలూరు సర్వజన ఆసుపత్రి వద్ద రోగులకు, ఆర్ఆర్‌పేట రోడ్డులో వెళ్లే పాదచారులకు రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి గొడుగులను పంపిణీ చేశారు. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఏలూరు వైభవ్ జ్యూయలరీస్ అధినేత గ్రంధి అమరేంద్ర సహకారంతో 30 మందికి గొడుగులు పంచామన్నారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి కేబీ సీతారామ్ పాల్గొన్నారు.

లోకో పైలెట్ రెస్ట్‌రూం ప్రారంభం

ఏలూరు టౌన్: ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో లోకో పైలెట్ రెస్ట్‌రూమ్‌ను విజయవాడ రైల్వేస్ డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన ఏలూరు జీఆర్‌పీ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, అక్కడ పరిస్థితులను ఆరా తీశారు. స్టేషన్‌లో ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైల్వే స్టేషన్‌లో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతానని చెప్పారు. రైల్వే ఎస్సై సైమన్, స్టేషన్ మాస్టర్ ఉన్నారు.



ఉంగుటూరు : యర్రచెరవు నీటితో నిండిపోయి నీలాద్రిపురం రహదారి



ఉంగుటూరు : యర్రచెరవు నీటితో నిండిపోయి నీలాద్రిపురం రహదారి

వీడని వాన.. ప్రజల్లో ఆందోళన

- 2,536 ఎకరాల్లో వరి నారుమడులు, నాట్లు మునక
- పల్లపు ప్రాంతాలు జలమయం

భీమడోలు : అకాల వర్షాలకు జన జీవనం స్తంభించింది. రెండు రోజులుగా కురుస్తోన్న జోరు వానలకు శుక్రవారం పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. లోతట్టు కాలనీల్లోని రోడ్లపై నీరు ప్రవహించింది. జాతీయ రహదారి భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వరకు ఆర్అండ్‌బీ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. భీమడోలు జంక్షన్, పోలసానిపల్లి వద్ద డ్రెయిన్ ఆక్రమణలకు గురవడంతో రోడ్లపైనే నీరు పారుతోంది. పూళ్ల, గుండుగొలను, పాతూరు తదితర గ్రామాల్లోని ముంపు నీరు కింద పారే అవకాశం లేక వరి పొలాలు ముంపు బారిన పడ్డాయి. వరి పొలాల చుట్టూ ఆక్వా చెరువులు విస్తరించడంతో పాటు డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ముంపు నీరంతా పంట పొలాల్లోకి చేరింది. భీమడోలు మండలంలో 430 ఎకరాల్లో నాట్లు, 20 ఎకరాల్లో నారు, ఉంగుటూరు మండలంలో 350 ఎకరాల్లో వరి నాట్లు, నిడమర్రు మండలంలో 575 ఎకరాల్లోని వరి నాట్లు, 35 ఎకరాల్లో వరి నారు, ద్వారకాతిరుమల మండలంలో 1,126 ఎకరాల్లోని వరి నాట్లు దెబ్బతిన్నాయని ఏడీఏ పి.ఉషా రాజకుమారి తెలిపారు. భీమడోలు బీసీ కాలనీలోని నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. గ్రామంలోని గొట్టాపు సత్యనారాయణ, ఎర్ర త్రినాథ్, చింతల సింహాచలం ఇళ్లు వర్షాలకు నానుతూ కూలేందుకు సిద్ధంగా ఉన్నట్టు



భీమడోలు : హైస్కూల్ ప్రధాన రోడ్డుపై నిలిచిన నీరు

వారు వాపోతున్నారు. కాలనీల్లో ముంపు నీరు దుర్వాసన రావడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పాఠశాలలకు శనివారం సెలవు

వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి జిల్లా వ్యాప్తంగా పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఎడతెరిపి లేని వర్షం కురిసే అవకాశాలున్నందున డీఈఓ శనివారం సెలవు ప్రకటించారు. భీమడోలు హైస్కూల్ ప్రధాన రోడ్డు వర్షపు నీటితో నిండిపోయింది.

ఉంగుటూరులో 91.2 మి.మీ. వర్షం

ఉంగుటూరు : మండలంలో గురువారం మధ్యాహ్నం నుంచి శుక్రవారం ఉదయం వరకు 91.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వెల్లమిల్లి, ఉంగుటూరు, చేబ్రోలు, కైకరం గ్రామాల్లో పంట పొలాల్లోకి పెద్ద ఎత్తున నీరు చేరింది. నారాయణపురం, ఉంగుటూరు, బాదంపూడి, వెలిమిల్లి, చేబ్రోలు, కైకరం, రాచూరు, గొల్లగూడెం తదితర గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. రోడ్లు అధ్వానంగా మారాయి. బొమ్మిడి – కాకర్లమూడి, ఉప్పాకపాడు రహదారి, తల్లాపురం రహదారులపై గోతులు ఏర్పడడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మెట్ట ప్రాంతంలో ఉన్న 22 ఇరిగేషన్ చెరువులు వర్షం నీటితో నిండిపోయాయి. ఉంగుటూరు యర్ర చెరువుకు నీరు పోటెత్తడంతో నీలాద్రిపురం రహదారి ప్రవహిస్తోంది. తిమ్మయ్యపాలెం, యర్రమళ్ల, వెలిమిల్లి గ్రామాలను ఆనుకున్న ఉన్న చెరువుల్లో నీరు ఎగదన్ని రోడ్లపైకి వస్తోంది. ఉంగుటూరులో సర్పంచ్ బండారు సింధు మధుబాబు, నారాయణపురంలో సర్పంచ్ దిడ్ల అలకానంద, కార్యదర్శి నాగేశ్వరరావులు గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. కైకరంలో పంచాయతీ కార్మికులు నీరు బయటకు వెళ్లే మార్గాలను ఏర్పాటు చేస్తున్నారు. అధికారులు వరద పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

నీట మునిగిన వరి నారు, నాట్లు

గణపవరం : భారీ వర్షానికి గణపవరం మండలంలో దాదాపు 2,500 ఎకరాల్లో వరినాట్లు, 130 ఎకరాల్లో నారుమడులు నీట మునిగినట్టు తాత్కాలికంగా అంచనా వేశామని ఏఓ యర్రంశెట్టి ప్రసాద్ తెలిపారు. ఆయన శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి, ముంపు సమస్యను పరిశీలించారు. గురు, శుక్రవారాల్లో రోజంతా వర్షం హోరున కురుస్తూనే ఉంది. గణపవరం, సరిపల్లె, కొమ్మర, అర్దవరం తదితర గ్రామాల్లో నారుమడుల్లో చేరిన నీటిని రైతులు బయటకు తోడుకుంటున్నారు. పొలాలలో వరి నాట్లు తేలిపోయే ప్రమాదం ఏర్పడిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 11,500 ఎకరాలకు ఇప్పటివరకు మూడు వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. పొలాల్లో చేరిన వర్షం నీరు రెండు మూడు రోజులు ఇలాగే ఉంటే వరినాట్లు కుళ్లిపోయి పనికిరాకుండా పోతాయని, మళ్లీ నాట్లు వేసుకోవాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. కొందరు రైతులు పొలాల్లో చేరిన నీటిని ఇంజిన్లు వేసి బయటకు తోడుకుంటున్నారు. అయినా వర్షం కురుస్తూనే ఉండటంతో ఫలితం ఉండటంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రామిలేరు డ్రెయిన్ పరిశీలన

పెదపాడు : బుడమేరు, లోయేరు, ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ భావనారాయణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అధిక వర్షాల కారణంగా బుడమేరు, లోయేరు డ్రెయిన్ ఉధృతిని ఆయన పరిశీలించారు. పెదపాడు మండలం సకల కొత్తపల్లి సత్యవోలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో నీరు చేరకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట వీఆర్వో అల్లు ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గుండేరు అండర్ టన్నెల్ పరిశీలన

దెందులూరు: జాతీయ రహదారిపై దెందులూరు మండలం సత్యనారాయణపురం వద్ద గుండేరు వాగు ఉధృతిని అండర్ టన్నెల్ వద్ద ఏలూరు ఆర్‌డీఓ ఎస్‌కే ఖాజావలీ శుక్రవారం పరిశీలించారు. గుండేరువాగు ఆయకట్టు పరిధిలో సాగు వివరాలు గతంలో పరిస్థితులు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, విధి నిర్వహణపై ఆరా తీశారు. గ్రామ స్థాయి ఉద్యోగులు రాత్రివేళల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. నాలుగు రోజులు పాటు ఏ సమయంలోనైనా పరిస్థితులనుబట్టి స్పందించాలని ఆదేశించారు. ఆర్‌డీఓ వెంట తహసీల్దార్ వి.జితేంద్ర, డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శిని, వీఆర్ఓ శ్రీను ఉన్నారు.



ఉంగుటూరు : చేబ్రోలు ఆయకట్టులో నీటమునిగిన పొలాలు



భీమడోలు : పోలసానిపల్లి పాఠశాల-1 చిన్నారులను ఇళ్లకు పంపుతున్న సిబ్బంది



గణపవరం : పొలాల్లో చేరిన వర్షపునీటిని బయటకు తోడుతున్న దృశ్యం



గణపవరం : జల్లికొమ్మరలో నీటమునిగిన పొలాలను పరిశీలిస్తున్న ఏఓ ప్రసాద్



దెందులూరు : గుండేరు అండర్ టన్నెల్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ ఖాజావలీ



ఉంగుటూరు : నారాయణపురంలో ముంపు నీటిని పంపుతున్న పంచాయతీ సిబ్బంది



భీమడోలు : పాక్షికంగా దెబ్బతిన్న ఇల్లు

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



ఆయుర్వేద వైద్యశాల వెనుక ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



గౌడవీధిలో రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్

దెందులూరు : జనావాసాల మధ్య రక్షణ లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. ఇటీవల మేకలు, గేదెలు మృతి చెందిన సంగతి విదితమే. పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులు జోక్యం చేసుకుని దెందులూరు బస్టాండ్ సెంటరులో ఆయుర్వేద వైద్యశాలకు వెనుక ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, గౌడవీధిలో చెరువు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు చిన్న పిల్లలకు సైతం అందే ఎత్తులో ఉండడం, ఎడతెరిపిలేని వర్షాల వల్ల స్థానిక ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే వాటి వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పారదర్శకంగా లెప్రసీ గుర్తింపు సర్వే

గణపవరం : కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి అన్నారు. శుక్రవారం గణపవరంలో లెప్రసీ డిటెక్షన్ సర్వే కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఏఒక్క ఇంటినీ వదలకుండా ప్రతి ఒక్కరికీ కుష్టు నిర్ధారణ పరీక్ష చేయాలన్నారు. స్పర్శలేని మచ్చలు, రాగిరంగులో మచ్చలు, ఒకటి లేదా ఐదు మచ్చలు ఉంటే లెప్రసీగా అనుమానించి, వైద్యాధికారి వద్దకు పంపాలని సూచించారు. పీహెచ్‌ఓ జాలాది విల్సన్ మాట్లాడుతూ ఈ సర్వే ఆగస్టు 2వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు. ఒక్కో సర్వే బృందం రోజుకు 15 నుంచి 20 గృహాలు సందర్శించి సర్వే వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



గణపవరంలో కుష్టు వ్యాధి గుర్తింపు కార్యక్రమం

సస్య రక్షణ చర్యలు పాటించండి

భీమడోలు: ఈ ఏడాది ఖరీఫ్ సాగును అలస్యంగా ఆరంభించగా, వరినాట్లు ఊపందుకున్న క్రమంలో అకాల వర్షాలు రైతులను నట్టేటముంచుతున్నాయి. నాట్లు, పిలక దశలోను ముంపుబారిన పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, ద్వారకాతిరుమల మండలాల్లో 55 ఎకరా ల్లో నారుమడులు, 2,481 ఎకరాల్లో వరినాట్లు ముంపునకు గురయ్యాయి. ముంపు నేపథ్యంలో వరి క్షేత్రాల్లో రైతులు చేపట్టాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన సస్య రక్షణ చర్యలపై భీమడోలు ఏడీఏ పి.ఉషారాజకుమారి పలు సూచనలందించారు. నారుమడి రెండు, మూడు రోజుల వయస్సులో ఉన్నప్పుడు మూడు రోజుల కన్నా ఎక్కువగా నీటి మునిగితే మొలకశాతం గణనీయంగా తగ్గుతుంది. ఈ దశలో వీలైన త్వరగా నీటిని బయటకు తీసేయాలి. దీనివల్ల విత్తనం గాలి పీల్చుకుని మొలక త్వరగా వస్తుంది. నీరు తీయడానికి వీలు లేక మొలక దెబ్బతిందంటే తిరిగి విత్తనం జల్లుకోవాల్సిన అవసరం ఉంటుంది. విత్తన 7 నుంచి 30 రోజుల మధ్యలో నారుమడి 5 రోజుల కన్నా ఎక్కువగా నీటి మునిగితే నారు దెబ్బతింటుంది. నీట మునిగిన ఐదు రోజుల్లోపు నీటిని పూర్తిగా తొలగించి పంటకు గాలి తగిలేలా చూడాలి. ఐదు సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో మ్యూరెట్ ఆఫ్ పొటాష్ వేసుకోవడం వల్ల కొత్త ఆకు వచ్చి నాట్లు వేసేందుకు అందివస్తుంది. వర్షాల వల్ల నారుమడిలో తెగుళ్లు సోకే అవకాశం ఉన్నందున, నీటిని బయటకు పూర్తి తొలగించి మొక్క నిలదొక్కుకున్న తర్వాత తెగుళ్ల నివారణకు ఒక గ్రాము కార్బెండజిమ్ లేదా రెండు గ్రాముల కార్బెండజిమ్, మాంకోజెబ్ మిశ్రమం ఒక లీటర్ నీటిలో కలిపి పైపాటిగా పిచికారీ చేయాలి. ఊడ్చిన వెంటనే, పిలక దశలో ముంపునకు గురైతే నీటిని బయటకు తీసేసి పైపాటిగా ఒక ఎకరాకు 20 కిలోల యూరి యా, 10 కిలోల పొటాష్‌లను బూస్టర్ డోస్‌గా వాడాలి. నీరు తొలగించలేని పక్షంలో ఆకుపై రెండు శాతం యూరియా లేదా పొటాషియం నైట్రేట్‌ను పిచికారీ చేయడం వల్ల పైరు త్వరగా పుంజుకుంటుంది. వరి పూర్తిగా కోలుకున్న తర్వాత మాగుడు తెగులు ఇతర కుళ్లు సోకకుండా కార్బెండజిమ్ ఒక గ్రాము లేదా 2 గ్రాముల కార్బెండజిమ్, మాంకోజెబ్ మిశ్రమం లీటర్ నీటిలో కలిపి పైపాటిగా పిచికారీ చేయాలి.

నారుమడుల్లో నీటిని తొలగించాలి

భీమడోలు: అకాల వర్షాలకు పాతూరు, భీమడోలు గ్రామాల్లో నీటి మునిగిన వరి నాట్లు, నారుమడులను వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం శుక్రవారం పరిశీలించింది. ఏలూరు డాట్ సెంటర్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ఫణికుమార్, ఎన్ నాగబాబు, వ్యవసాయ శిక్షణా కేంద్రం ఏడీఏ సుధారాణిలతో కలిసి భీమడోలు వ్యవసాయ సహాయ సంచాలకులు పి.ఉషారాజకుమారిలు ముంపు బారిన పడిన పంట పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. నారుమడుల్లోని ముంపు నీటిని వెంటనే బయటకు తొలగించుకోవాలని సూచించారు. అశ్రద్ధ చేస్తే తెగుళ్లు సోకే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. తెగుళ్ల నివారణకు ఒక గ్రాము కార్బెండజోల్ లేదా 20 గ్రాముల సాఫ్ అనే మందును ఒక లీటర్‌తో కలిపి నారుమడి తడిసే విధంగా వర్షాలు తగ్గిన తర్వాత పిచికారి చేయాలన్నారు. లద్దె పురుగులు కనిపిస్తే క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్‌ను ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పిలకలు వేసే దశలో పంట ముంపుకు గురైతే నీటిని బయటకు తీసేసి బూస్టర్ డోస్‌గా 20 కేజీల యూరియా, 10 కేజీల పొటాష్ పైపాటిగా వేయాలన్నారు. కార్యక్రమంలో భీమడోలు ఏఓ పి.ఉషారాణి, వీఆర్వో ఎస్ నాగేశ్వరరావు, వీఏఏలు డి.శైలాభాను, డి.భాను, రూప, గ్రామ రైతులు వెజ్జు రాంబాబు, షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ముంపు చేల పరిశీలన

ఉంగుటూరు : మండలంలోని నీటమునిగిన బాదంపూడి, వెల్లమిల్లి, చేబ్రోలు, కైకరం, ఉంగుటూరు ఆయకట్టు పంటపొలాలను మండల వ్యవసాయ అధికారి బాలిన వెంకటేష్ శుక్రవారం పరిశీలించారు. మండలంలో 320 ఎకరాల్లో నారుమడులు, 1704 ఎకరాల్లో వరి నాట్లు నీటమునిగాయని ఆయన తెలిపారు. నారుమడులు, నాట్లు వేసిన చేలల్లో ముంపు నీటిని బయటకు వెళ్లే మార్గాలు ఏర్పాటు చేయాలని రైతులకు సూచించారు. ముంపు నుంచి కోలుకున్న తర్వాత తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలను రైతులకు వివరించారు.



భీమడోలు : పాతూరులో రైతులకు సూచనలిస్తున్న సీనియర్ సైంటిస్ట్ ఫణికుమార్



ఉంగుటూరు : ముంపు పొలాలను పరిశీలిస్తున్న ఏఓ వెంకటేష్

ఆర్డీఓ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు

ఏలూరు(మెట్రో): భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ఏలూరు ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫోన్ నెంబర్ 08812 232044కు బదులు, ఏలూరు డివిజన్‌లో వరదకు సంబంధించిన సమస్యలు ఉంటే నేరుగా తన ఫోన్ నెంబర్ 94910 41424కు కాల్ చేయవచ్చని ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి అన్నారు. 12 మండలాల తహసీల్దార్ల ఫోన్ నంబర్స్ తెలియజేశారు. అవి.. భీమడోలు 94910 41441, దెందులూరు 94910 41449, ఏలూరు 94910 41440, గణపవరం 94910 41450, కైకలూరు 98499 03990, కలిదిండి 99086 64641, మండవల్లి 98499 03980, ముదినేపల్లి 98499 03976, నిడమర్రు 94910 41453, పెదపాడు 94910 41444, పెదవేగి 94910 41445, ఉంగుటూరు 94910 41448. తమ్మిలేరు వరద దృష్ట్యా ముందస్తు చర్యగా ఏలూరు అర్బన్ ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలను ఆర్డీఓ శుక్రవారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. నదీపరివాహక ప్రాంతమైన సాయినగర్, వైఎస్ఆర్ కాలనీ, ఎస్ఎంఆర్ నగర్, కొమడవోలు, తదితర ప్రాంతాల్లో ఆర్డీ ఓ పర్యటించారు.

దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో..

దెందులూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వర్షాలు సహాయ పునరావాస చర్యల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, రెండు రోజులుగా కురుస్తోన్న వర్షాలకు ముంపు, ప్రమాదాలు, ఇతర నష్ట సమాచారాన్ని ఫోన్ నెంబర్లు 86884 37137, 94910 41449లో తెలియచేయాలని తహసీల్దార్ వి.జితేంద్ర కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రజలు కాచిన చల్లార్చిన నీరు తాగాలని, తడిచిన విద్యుత్ స్తంభాల వద్దకు దూరంగా ఉండాలని సూచించారు. మండలంలో ప్రజలందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. తమ్మిలేరు, గుండేరు సమీపంలో ఉన్న ప్రజలందరూ అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శిని, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమ మాలిని, వీఆర్ఓలు శ్రీను, అనిరుధ్ ఉన్నారు.